# 50వేలకు మించి నగదుతో ప్రయాణించొద్దు

- సరైన పత్రాలు తప్పనిసరి..లేకుంటే సీజ్
- జిల్లా కలెక్టర్ గౌతమ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గౌతమ్, అధికారులు

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 21: ఎన్నికల నియమావళి ప్రకారం ఎవరూ కూడా రూ.50వేల కంటే ఎక్కువ నగదుతో ప్రయాణం చేయొద్దని, సరైన పత్రాలు లేకుండా వెళ్తే సీజ్ చేస్తామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ సభ్యులతో శనివారం కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసులు, ఎఫ్ఎస్టీ బృందాలు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను పరిశీలించి, విడుదల చేసేందుకు జిల్లా స్థాయి గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న నగదును విడుదల చేసేందుకు వచ్చిన ఫిర్యాదు, దరఖాస్తులను కమిటీ కన్వీనర్, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ మూర్తి, సభ్యులు డీటీవో నర్సింహారావు, డీఆర్‌డీవో పద్మజారాణి పరిశీలిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఎఫ్-12లో ఉంటుందని, ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లొద్దని, దొరికిన నగదును సీజ్ చేసి, డిపాజిట్ చేస్తామన్నారు. ఎన్నికలకు సంబంధంలేదని, సరైన ఆధారాలు చూపితే తిరిగి ఇచ్చేస్తామని తెలిపారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, వివాహం ఇతర అవసరాలకు తీసుకెళ్లే వారు సరైన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. సీజ్ అయిన నగదు కోసం గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్ మూర్తి నంబర్ 91001 15724, సభ్యులు నర్సింహారావు 77999 34204, పద్మజారాణి 73309 99280లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

**ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కతరించాలి**

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని, రాజకీయ పార్టీల అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వకంగా సమాధానం అందించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, డీజీపీ అంజనీకుమార్, ఉన్నతస్థాయి అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి సువిధ యాప్ ద్వారా, ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించాలని, ఎంసీఎంసీ ధ్రువీకరించాలన్నారు. ప్రతిరోజు ఎంసీఎంసీ, సువిధ యాప్ ఆన్‌లైన్ దరఖాస్తులపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. నగదు, బంగారం వంటి వివరాలు, ఎక్కడ విజ్ఞప్తి చేసుకోవాలి అనే అంశాలను తెలియజేస్తూ రసీదు ఇవ్వాలన్నారు. నగదు, బంగారం రూ.10లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించాలని, అంతకంటే ఎక్కువైతే ఐటీ అధికారులకు అప్పగించాలన్నారు. సంబంధిత వ్యక్తులకు అప్పీల్ అనంతరం విడుదల చేసే నగదు వివరాలను సమాచార మాధ్యమాలకు వెల్లడించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్స్ బృందాలతోపాటు తప్పనిసరిగా వీడియో కెమెరా సౌకర్యం ఉండాలని, ప్రతి తనిఖీ వీడియో కెమెరాలో రికార్డు చేయాలన్నారు. జిల్లాలో ఓటరు స్లిప్పులు త్వరగా ముద్రించి, పంపిణీ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని, సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల నిర్వహణపై వస్తున్న వదంతులు, అపోహలను నివృత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలపై అధిక దృష్టి సారించి, పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులకు కలెక్టర్ సూచించారు.

## ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు

మేడ్చల్, అక్టోబర్ 21: జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం నుంచి ఆయా కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు తరలించే ఏర్పాట్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. శనివారం ఉదయం వారి సమక్షంలో ఈవీఎం గోదాం తెరిచి, ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేశామన్నారు. వాటిని జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు తరలించి, భద్రపరుస్తామన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడి పర్యవేక్షణలో రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

## రూ.37.23 కోట్ల నగదు సీజ్

- ఎన్నిక నియమాళికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు
- జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్



సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): ఎన్నికల నియమావళిలో భాగంగా శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ రూ.3లక్షల నగదును సీజ్ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఇప్పటి వరకు రూ.1,15,03,970 నగదు, పోలీసు అథారిటీ ద్వారా రూ.1,78,17,148 సీజ్ చేయగా.. మొత్తం రూ.37,23,30,006 నగదు సీజ్ చేశామని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ కింద లైసెన్స్ ఆయుధాలను ఇప్పటి వరకు 4,316 సేకరించారని, సీఆర్‌పీసీ కింద శనివారం 51 కేసులు నమోదు కాగా, ఇప్పటి వరకు 444 కేసులు నమోదయ్యాయి. శనివారం 134 మందిని బైండోవర్ చేయగా, ఇప్పటి వరకు మొత్తం 1215 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎంసీసీ ఉల్లంఘన కింద గోడలపై ఉన్న రాతలను, పోస్టర్లను ఇప్పటి వరకు 67330 తొలగించామని, అదేవిధంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు మాస్కులు వేయడం జరిగిందని, ఇందులో సుమారు 72,704 విగ్రహాలున్నాయని తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలపై శనివారం ఒక కేసు నమోదు కాగా, ఇప్పటి వరకు 9 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా ఈరోజు 308 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేయగా, మొత్తం 5397 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశామని జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ వెల్లడించారు.

## మద్యం నిల్వలపై డేగ కన్ను

- మూడు జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు
- అక్రమ నిల్వలు, రవాణాపై ప్రత్యేక దృష్టి

సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం నిల్వలు, రవాణా, విక్రయాలపై ఆబ్కారీ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టేందుకు మద్యాన్ని ఎరగా చూపే అవకాశాలుండటంతో అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు ఆబ్కారీ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం వినియోగదారులపై డేగ కన్ను పెట్టినట్లు ఆబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులతో కలిసి 14 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని జిల్లా ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లా సరిహద్దులతోపాటు నగర సరిహద్దుల్లో సైతం విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి రెవెన్యూ జిల్లాతోపాటు ఎక్సైజ్ యూనిట్ పరిధిలో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్, స్టేట్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోపాటు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు చెందిన బృందాలు మద్యం, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రతేక నిఘా పెట్టినట్లు తెలిపారు.

**ప్రత్యేక బృందాలు**

ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 4 నుంచి 5 బృందాలు పని చేస్తున్నట్లు అధికారులు వివరించారు. సున్నిత ప్రాంతమైన హైదరాబాద్ రెవెన్యూ జిల్లా పరిధిలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్.వియజ్ ఆదేశాల మేరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డి వెల్లడించారు. పోలీసులతో కలిసి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ఈ చెక్‌పోస్టుల వద్ద అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల రవాణాను అడ్డుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి మద్యం దుకాణంతోపాటు బార్ అండ్ రెస్టారెంట్ రికార్డులను సైతం తనిఖీలు చేస్తున్నామని, నిబంధనలు పాటించని దుకాణాలపై ఎన్నికల కోడ్ చట్టంతోపాటు ఆబ్కారీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గడిచిన వారం రోజుల్లో 15 కేసులు నమోదు చేసి, సుమారు రూ.10లక్షల విలువైన గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు వివరించారు.

**మద్యం అక్రమ నిల్వ చేస్తే జైలే..**

పెద్ద మొత్తంలో మద్యం నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని, ఎన్నికల కోడ్ సమయంలో మద్యం నిల్వ చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కరుణారెడ్డి హెచ్చరించారు. ప్రైవేటు పార్టీలకు తప్పనిసరిగా ఆబ్కారీతోపాటు పోలీసుల నుంచి అనుమతి పొందాలని, అనుమతి లేకుండా అధిక మొత్తంలో మద్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం నిల్వ చేస్తే జైలు శిక్ష తప్పదని ఇన్‌స్పెక్టర్ కరుణ హెచ్చరించారు.

## సమస్యల పరిష్కారానికి ఫార్మసీ యాక్ట్ తీసుకురావాలి

**తెలంగాణ ఫార్మాసిస్ట్ అసోసియేషన్స్ జేఏసీ కన్వీనర్ వి.అశోక్ కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

ఖైరతాబాద్, అక్టోబర్ 21: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫార్మాసిస్టుల సమస్యల పరిష్కారానికి ఫార్మసీ యాక్ట్ తీసుకురావాలని తెలంగాణ ఫార్మసిస్ట్ అసోసియేషన్స్ జేఏసీ కన్వీనర్ వి.అశోక్ కుమార్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు వ్యాపారస్తులు ఫార్మాసిస్టుల సర్టిఫికెట్ అఫిడవిట్లు తీసుకొని మందుల దుకాణాలు పెట్టుకొని కేవలం రూ.1,500 చేతిలో పెట్టి మోసం చేస్తున్నారని ఆరోపించారు. కొందరు వ్యాపారస్తుల వద్ద ఫార్మాసిస్టులుగా పనిచేస్తున్నా వారికి సరైన వేతనాలు లేవని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫార్మాసిస్టులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు జేఏసీ ఏర్పాటు చేశామన్నారు. జేఏసీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సొంతంగా మందులను షాపులను ఏర్పాటు చేసుకొని అందులో ఫార్మాసిస్టులకు నెలకు రూ.30 వేల వేతనం, పది లక్షల ఇన్సూరెన్స్, ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తామన్నారు. సమావేశంలో జేఏసీ కో కన్వీనర్లు కె.బాలరాజు, బి.సత్యనారాయణ గౌడ్, శివ కుమార్, సహాయ కార్యదర్శి కె.శంకర్ పాల్గొన్నారు.

## బీఎల్వో, సూపర్‌వైజర్ సస్పెన్షన్

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి**

సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): ఓటర్ల జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ లెవెల్ అధికారి(బీఎల్‌వో), సూపర్‌వైజర్లపై రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి సస్పెన్షన్ వేటు వేశారు. శేరిలింగంపల్లి శాసనసభా నియోజకవర్గంలోని 335 పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల జాబితాలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందింది. దీంతో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విచారణ జరిపించారు. ఓటరు జాబితాలో పొరపాట్లు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీఎల్‌వో సుజాత, సూపర్‌వైజర్ గణేశ్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## గంజాయి, అక్రమ మద్యం విక్రయదారులపై ఆబ్కారీ కొరడా

- 11కేసులు నమోదు.. ఏడుగురు అరెస్టు
- రూ.7లక్షల విలువైన 22.226 కిలోల గంజాయి, 47.70 లీటర్ల మద్యం సీజ్



సిటీబ్యూరో, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రూ.7లక్షల విలువ చేసే 22.226 కిలోల గంజాయి, 47.70 లీటర్ల అక్రమ మద్యం సీజ్ చేశారు. అంతే కాకుండా గడువు తీరిన 77బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్.విజయ్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అజింక్య పండరీ విశాఖపట్నంలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి, ధూల్‌పేటలోని మహేందర్‌సింగ్‌కు విక్రయిస్తుంటాడు. ఇందులో భాగంగా వైజాగ్ నుంచి కొనుగోలు చేసిన రూ.5.55 లక్షల విలువ చేసే 22.226 కిలోల గంజాయిని మహేందర్‌సింగ్‌కు అందజేసేందుకు యత్నిస్తుండగా.. సమాచారం అందుకున్న జిల్లా డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డి, ధూల్‌పేట ఎక్సైజ్ బృందాలతో కలిసి శుక్రవారం పండరీని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి గంజాయితోపాటు రవాణాకు వినియోగించిన మారుతి కారును సీజ్ చేశారు. మరో కేసులో గడువు తీరిన బీర్లను విక్రయించడమే కాకుండా రికార్డులు సరిగ్గా మెయింటెయిన్ చేయని పీవీకే ఫుడ్ చైన్ బార్ అండ్ రెస్టారెంట్‌పై దాడులు జరిపారు. ఈ దాడుల్లో గడువు తీరిన 77కింగ్ ఫిషర్ బీర్లను(25.41లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా సమయపాలన పాటించని బాలాజీ పవన్ దాబా అండ్ రెస్టారెంట్, రాజా రెస్టారెంట్ అండ్ బార్‌లపై కూడా కేసులు నమోదు చేసినట్లు డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కరుణారెడ్డి తెలిపారు. దీంతోపాటు గడిచిన ఐదు రోజుల్లో మొత్తం 11 కేసులు నమోదు చేసి, 7 మందిని అరెస్టు చేశామని, సుమారు రూ.7లక్షల విలువ చేసే 22.226 కిలోల గంజాయి, 47.70 అక్రమ మద్యం సీజ్ చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ సీహెచ్.విజయ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కంచర్ల కరుణారెడ్డితోపాటు ధూల్‌పేట, నాంపల్లి, గోల్కొండ, చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్‌లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.